క్లుప్తంగా

ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక విద్యాబోధన దిశగా ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని డీఈఓ పి.శైలజ పేర్కొన్నారు. రైలు పేటలోని గొలుసు నాంచారమ్మ- కొండలరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ నూతన బోధన పద్ధతులను నేర్చుకుని, తమలోని బోధన నైపుణ్యాలను మెరుగుదిద్దుకోవాలని సూచించారు. అదే విధంగా టెన్త్ విద్యార్థులకు జరుగుతున్న బోధన తీరు, తెన్నులను ఆమె పరిశీలించారు.

టోఫెల్ శిక్షణ కోసం విద్యార్థిని దత్తత

ఇదే పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ లౌక్యను టోఫెల్ బోధించేందుకు డీఈఓ శైలజ దత్తత తీసుకున్నారు. అదే విధంగా జిల్లాలోని విద్యాధికారులతో పాటు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు టోఫెల్ బోధించేందుకు ఆరో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని, వారి వివరాలను గూగుల్‌ఫామ్‌లో పూరించి డీఈఓ కార్యాలయానికి పంపాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వివరించారు. మహిళా ఉపాధ్యాయినులు బాలికలను, పురుష ఉపాధ్యాయులు బాలురను దత్తత తీసుకోవాలని కోరారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

కాకినాడ క్రైం: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుంటూరులోని ఆర్.అగ్రహారంకు చెందిన ఆలపాటి సాంబశివరావు(85), 2019లో బాలికపై లైంగిక దాడికి పాల్పడి జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2021 జూలై 3వ తేదీన రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి చేర్చారు. అనారోగ్యానికి గురి కావడంతో ఈ నెల 13వ తేదీన జైలు అధికారులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సిఫారసు మేరకు అదే రోజు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సాంబశివరావు మంగళవారం మృతి చెందగా కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నవజాత శిశు మరణాలపై దృష్టి పెట్టండి

గుంటూరు మెడికల్: నవజాత శిశువుల మరణాలను తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కోరారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నవ జాతా శిశు సంరక్షణ అవసరం అంశంపై మంగళవారం సింపోజియం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ జాతా శిశువుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. నవ జాత శిశువుల జననానికి ముహూర్తాలు నిర్ణయించి ఆపరేషన్లు చేయాలని తల్లిదండ్రులు కోరుకోవడం బాధాకరమన్నారు. విద్యావంతులు కూడా అవగాహనా లేకుండా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఆధునిక వైద్యాన్ని అభ్యసించి వైద్యులు ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధా రమణ శ్రీ, శాంత కుమారి పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట 2/7లోని శ్రీ గౌరి విశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు విశ్వేశ్వర శర్మ దంపతులతో కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో పొన్నలూరి సీతా రామాంజనేయులు, సీతారత్నకుమారి, ఉప్పులూరి గణేష్, కుమారి దంపతులు పాల్గొన్నారు. అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్ కుమార్ శర్మ, మల్లికార్జున శర్మ, చక్రపాణి, కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: నివాసంలో చోరీ ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. అరుంధతీనగర్‌లో నివాసం ఉండే బాలకృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యులతో సోమవారం రాత్రి ఎప్పటిలానే నివాసంలో నిద్రించారు. తిరిగి మంగళవారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించాడు. ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనం, మూడు సెల్ ఫోన్లు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా తాగునీటి సరఫరా

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



తక్కెళ్లపాడు హెడ్ వాటర్ ప్లాంట్ లో పర్యటిస్తున్న మేయర్ కావటి

నెహ్రూ నగర్: తాగునీటిని ప్రణాళికాబద్ధంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. తక్కెళ్లపాడులోని నగర పాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్‌ని ఇంజినీరింగ్ అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ, నగరంలోని బీఆర్ స్టేడియం, ఐపీడీ కాలనీ, నల్లచెరువు, శ్రీనివాసరావు తోట, తారకరామ నగర్, ఆటో నగర్, ఏటుకూరు రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన బుధవారం సాయంత్రానికి క్లీనింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు రిజర్వాయర్ల వారీగా ఏఈలకు బాధ్యతలు కేటాయించాలని ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో కృష్ణా నది నుంచి వస్తున్న నీటిని నిర్దేశిత విధానంలో శుభ్రం చేసే ప్రక్రియను ఈఈ నేరుగా ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని, ఆలం, క్లోరిన్ అవసరానికి తగిన విధంగా నిల్వ చేసుకోవాలని చెప్పారు. నగరంలో తాగునీటి సరఫరాపై ఎక్కడా ఫిర్యాదు రాకూడదని, ఫిర్యాదు వస్తే సంబంధిత ఏఈ తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ సుందర్‌రామిరెడ్డి, ఈఈలు శ్రీనివాస్, కొండా రెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ బాబర్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో ఓవరాల్ చాంపియన్‌కు అభినందనలు



విద్యార్థులతో దేవినేని మల్లికార్జునరావు, శివాజీ, విష్ణువర్ధన్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా బాలోత్సవంలో ఓవరాల్ చాంపియన్లుగా నిలిచిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులను పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందించారు. హిందూ కళాశాలలో ఈనెల 17, 18వ తేదీల్లో బాలోత్సవం నిర్వహించారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు స్కిట్, వక్తృత్వ, క్యాలీగ్రఫీ, చిత్రలేఖన, స్టోరీ టెల్లింగ్, స్పెల్‌బీ పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకుని, ఓవరాల్ చాంపియన్‌షిప్ అందుకున్నట్లు చెప్పారు. విద్యార్థుల మేధాశక్తిని ప్రతిభా పాటవాలను పెంపొందించే విధంగా అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నందున బాలోత్సవం వంటి పోటీల్లో విజేతలుగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి పాల్గొన్నారు.

పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించగలం

–జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్



మాట్లాడుతున్న పాఠశాల డైరెక్టర్ సుబ్బారావు, వేదికపై జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టుదలతో జీవితంలో ఏదైనా సాధించగలమని జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ ఎం .వరప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని జూబిలేషన్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలనే గట్టి సంకల్పం, దానిని తగిన కృషి తోడైతే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకోగలమని అన్నారు. ఈసందర్భంగా టెన్త్ పరీక్షల్లో తప్పిన తాను మరలా కసితో పరీక్షలకు సన్నద్ధమై విజయం సాధించడంతో పాటు గ్రూప్-1 సాధన వరకు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ టీపీ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలో టెన్త్ పూర్తి చేసుకున్న వెళ్లిన పూర్వ విద్యార్థుల విజయగాథలను వివరించారు. అనంతరంవిద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎస్.శ్రీనివాసరావు, హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ఎస్. రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో గుంటూరు క్రీడాకారుల ప్రతిభ



హైదరాబాద్‌లో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుంటూరు క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో గుంటూరు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో పలు పతకాలు సాధించారని కాశీనాథ్ మార్షల్ అకాడమీ కార్యదర్శి బి.కాశీనాథ్ రెడ్డి మంగళవారం తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 400 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. తమ అకాడమీ క్రీడాకారులు 15 బంగారు, 3 రజతాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు సినీనటుడు సుమన్ చేతుల మీదగా చాంపియన్ ట్రోఫీ అందించినట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు

- జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి
- కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న సాగు పరిశీలన



సజ్జ పైరును పరిశీలిస్తున్న డాక్టర్ సి.తారాసత్యవతి, డాక్టర్ సుబ్బారాయుడు, రైతులు

తెనాలి: వరి, గోధుమలకు మించిన పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు లభిస్తాయని హైదరాబాద్‌లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి చెప్పారు. ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం దావులూరులో 11 రకాల సజ్జ, 10 రకాల జొన్న పంటను సాగుచేసిన అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ పంటపొలాన్ని మంగళవారం సందర్శించారు. ఏపుగా పెరిగిన ఆయా రకాలను రైతులకు చూపారు. అక్కడే చిరుధాన్యాల ఆవశ్యకతను, సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సదస్సులో డాక్టర్ తారా సత్యవతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో రైతులకు అధిక ఆదాయంతోపాటు పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఆ పంటల సాగు పెరుగుతోందని, దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పెరిగిందన్నారు. డెల్టాలో ఖరీఫ్ వరిసాగు తర్వాత జొన్న, సజ్జతో పాటు ఇతర చిరుధాన్యాలను జీరో టిల్లేజ్ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలుగా ఏర్పడి ప్రాసెసింగ్ చేసుకుని అమ్మగలిగితే మరింత ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుబ్బారాయుడు తన ప్రసంగంలో, ఐఐఎంఆర్ 11 రకాల సంకరజాతి జొన్న విత్తనాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇక్కడి రైతులు సాగుచేసే జొన్నలో ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే, ఐఐఎంఆర్ రకాల్లో 40–50 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయన్నారు. అధ్యక్షత వహించిన 'ఆత్మ' ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ, లాభదాయకంగా ఉంటుందనే భరోసా ఇవ్వగలిగిన రకాలను అందిస్తే, విజయవంతం కాగలవన్నారు. అభ్యుదయ రైతు గొట్టుముక్కల శ్రీధర్ మాట్లాడుతూ ఐఐఎంఆర్ ఇచ్చిన 11 రకాల సజ్జ, ఆరు జొన్న రకాలతో పాటు వ్యవసాయశాఖ రెండు, తన సొంతంగా మరో రెండు రకాల మొత్తం 21 రకాల సజ్జ, జొన్న పంటలను సాగుచేసినట్టు తెలిపారు. లాం ఫారం చిరుధాన్యాల శాస్త్రవేత్త డాక్టర్ పుష్పరేణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి మాట్లాడారు. కొల్లిపర వ్యవసాయాధికారి వెంకట్రావు స్వాగతం పలికారు. రైతులు, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణ, పీఎల్‌జీ సూర్యప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆచార్య గుజ్జర్లమూడి కృపాచార్యులు పాల్గొంటారన్నారు. అందరూ పాల్గొనాలని కోరారు.

ఎమినిటీ సెక్రటరీలకు పూర్తిస్థాయి బాధ్యతలు

నెహ్రూ నగర్: కార్పొరేషన్ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి నూతన సంస్కరణలు తీసుకొచ్చారు. నగర ప్రజలకు మెరుగైన సత్వర సేవలు అందించుటకు ఎమినిటి కార్యదర్శులకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా, అభివృద్ధి పనుల్లో పారదర్శక పర్యవేక్షణకు, తాగునీటి సరఫరా విభాగంలోని కిందస్థాయి సిబ్బంది బాధ్యతారాహిత్య పనుల నివారణకు, అవినీతి నియంత్రణకు ఎమినిటి కార్యదర్శులకు ప్రత్యేకంగా పూర్తి స్థాయి బాధ్యతలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు నగరంలో తాగునీటి పైప్‌లైన్‌లపై లీకులు, వాల్ పిట్స్ నిర్వహణ లోపాలను, అనధికార కుళాయిలు వంటి అంశాలు ప్రత్యేక బృందాల పర్యవేక్షణలో వెలుగులోకి వచ్చాయని, భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయి పర్యవేక్షణకు వార్డు సచివాలయ ఎమినిటీ సెక్రటరీలకు పూర్తి స్థాయి బాధ్యతలు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని 206 వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించే అభివృద్ధి పనుల నిర్వహణ, రిపోర్టింగ్‌ల ఎం.బుక్ రికార్డింగ్, ప్రతి పనికి ఎంబుక్‌లో చెక్ మెజర్‌మెంట్ చేయాల్సి ఉంటుందన్నారు. పనుల అమలు సమయంలో నాణ్యత పరీక్షలను నిర్వహించడం, రోడ్లపై గుంతల గుర్తింపు, మరమ్మతులు, అంచనా ప్రతిపాదనల తయారీ వంటి రోడ్డు నిర్వహణ పనులు తాగునీటి సరఫరా సమయాల్లో(ఉదయం, సాయంత్రం) క్లోరిన్ శాంపిల్స్ సంబంధిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పైప్‌లైన్ కేజీల గుర్తింపు, వాల్వ్‌లు, లీకేజీల కోసం వాల్వ్ పిట్‌ల పరిశీలన, ఓపెన్ డ్రెయిన్లు ఉన్న ప్రాంతాలను తనిఖీ చేయడం, సరిదిద్దడానికి శానిటేషన్ సెక్రటరీకి తెలియజేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

తోపుడు బండి అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో ఒక నిరుపేద వ్యక్తికి జీవనోపాధి కోసం తోపుడు బండిని గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్, దాత సహాయం చేశారు. స్థానిక కోబాల్ట్ పేటలో డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో మంగళవారం తోపుడు బండిని అందజేశారు. గుంటూరు నగరంలో నిరుపేదలకు జీవనోపాధి కోసం తోపుడు బండి, కుట్టు మెషిన్ కావాల్సిన వారు గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ వారి సెల్ 8143222456, 9397602553 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు



పాత గుంటూరు: పట్టాభిపురంలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ప్రవచనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహా సహస్రావధాని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పాల్గొని శ్రీ దక్షిణామూర్తి వైభవం అంశంపై ప్రవచనం చేశారు.

హక్కులతో పాటు బాధ్యతలు తెలుసుకోవాలి

ఎమ్మెల్యే సుచరిత

ప్రత్తిపాడు: ప్రతి విద్యార్థి హక్కులతో పాటు బాధ్యతలు కూడా తెలుసుకుని మెరుగైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. పారా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవ హక్కుల క్లబ్ విద్యార్థులు మంగళవారం సంస్థ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే సుచరితను గుంటూరులోని ఆమె కార్యాలయంలో కలిశారు. హైస్కూల్స్‌లో బాలల క్లబ్‌ల ద్వారా మానవ హక్కులు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొద్దిరోజులుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. మానవాభివృద్ధిలో మెరుగుదల సాధించేందుకు చేపట్టవలసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను వినతి పత్రంలో పేర్కొన్నారు. పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తురకా మంగయ్య, ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏపిజె అబ్దుల్ కలాం మానవ హక్కుల క్లబ్, అంబేద్కర్ మానవహక్కుల క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నాటికల పోటీలు

తెనాలిటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. పోటీలలో తొలుత బసవరాజు జయశంకర్ పర్యవేక్షణలో శ్రీ సద్గురు కళానిలయం గుంటూరు వారి 'బహురూపి' నాటికను ప్రదర్శించారు. శిష్టా చంద్రశేఖర్ రచించిన ఈ నాటికకు కె.వి.ప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం రెండో ప్రదర్శనగా ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి 'క్షేత్రం' నాటికను ప్రదర్శించారు. శిల్ప ఆకురాతి రచన చేయగా జి.మనోహర్ దర్శకత్వం వహించారు. సాంఘిక నాటక రంగంపై సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, ప్రముఖ నాటక రచయితలు డాక్టర్ చిలువూరు నాగేశ్వరరావు, ఆకురాతి భాస్కర్ చంద్రలు సమీక్ష జరిపారు. అనంతరం తృతీయ ప్రదర్శనగా కళావర్షిణి హైదరాబాద్ వారి 'అజరామరం' నాటికను ప్రదర్శించారు. హరిబాబు జెట్టి రచన, దర్శకత్వం వహించారు. మూడు నాటికల పోటీల కళాకారులకు ప్రదర్శన పారితోషకాన్ని ప్రణాళిక శాఖ ఉప కార్యదర్శి ఎ.వి.సుబ్బారావు, కావూరి సత్యనారాయణలు అందజేశారు. నాటక కళా పరిషత్ నిర్వాహకులు ఆరాధ్యుల కన్నా పర్యవేక్షించారు.

సీఎం వైఎస్ జగన్ బీసీలకు పెద్దపీట

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



వసంత కుమార్‌కి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూ నగర్: వైఎస్సార్ సీపీ బీసీలకు సముచిత స్థానం కల్పించిందని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు అగ్ర తాంబూలం ఇస్తున్నారని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం గుంటూరు నగర యువజన విభాగం అధ్యక్షుడిగా పోకల వసంత కుమార్ నియమిస్తూ సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు గూడూరు నాని ముదిరాజ్ నియమించిన నేపథ్యంలో నియామక పత్రాన్ని అప్పిరెడ్డి చేతుల మీదుగా బృందావన్ గార్డెన్స్‌లోని అప్పిరెడ్డి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం బీసీలను నయవంచన చేసి వారిని అన్ని విధాలుగా చంద్రబాబు ఇబ్బందులు గురి చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఇంత మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బీసీలంతా అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు నాని ముదిరాజ్ మాట్లాడుతూ బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌కు బీసీల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకోవాలి



మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. మంగళవారం నియోజకవర్గంలోని 17వ డివిజన్‌లో కార్పొరేటర్ ఫర్జానా ఆధ్వర్యంలో ఐపీడీ కాలనీలోని ఇమిడి కల్యాణ మండపంలో పార్టీ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని గెలిపించడం ద్వారా భావితరాలకు భరోసా అని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చామని, ఇప్పటికే 99 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అంటే ఒక కులానికో, మతానికో చెందిన పార్టీ కాదని, ప్రజల కష్టాల్లో నుంచి ఆవిర్భవించిన శక్తి అని తెలిపారు. నిరుపేదలు, బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. ఎటువంటి విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరం కలిసి కట్టుగా తూర్పు నియోజకవర్గంలో అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కర్నూమ, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, ఎర్రబాబు, బిఖారి, యాదాల చిన్న, రమణి, రాము, ఆంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, నాగూర, కొండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, తిలక్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. విద్యానగర్‌లోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో మంగళవారం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు. సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకున్న విద్యార్థులు సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా అద్భుతమైన ప్రాజెక్టులను రూపకల్పన చేశారని అభినందించారు. ఖర్చుకు వెనుకాడకుండా విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ప్రాజెక్టులను తయారు చేయించడం ద్వారా వారిలో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు చేయాలనే ప్రోత్సాహాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలతో జాతీయ రహదారుల క్లీనింగ్ రోబోట్స్, డ్రోన్ వర్కింగ్ మోడల్, లేజర్ లైట్ సెక్యూరిటీ అలర్ట్, వాక్యూమ్ క్లీనర్, హైడ్రోపోనిక్ వ్యవసాయం, ఎర్త్‌క్వేక్, క్రాప్ ప్రొటెక్షన్ అలార్మ్ తదితర ప్రాజెక్టులను రూపొందించారని వివరించారు. ప్రిన్సిపాల్ నవీన్ చౌదరి, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రూపకల్పన చేశారని తెలిపారు. అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.బాలకృష్ణ, ఏజీఎం భానుప్రసాద్, ప్రైమరీ ఇన్‌చార్జి సునీత పాల్గొన్నారు.

చిదంబర శాస్త్రి దంపతులకు పురస్కారం



చిదంబర శాస్త్రి దంపతులకు పురస్కారం ప్రదానం చేసిన నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతజాతి చిరకాల స్వప్నమైన శ్రీరామ మందిరం ఇన్నేళ్లకు సాకారమైందని హనుమ ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకుడు డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో మంగళవారం చెరువు సూర్యనారాయణమూర్తి- సీతారావమ్మ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిదంబరశాస్త్రి దంపతులను పురస్కారంతో సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ కాలేజీ హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిదంబరశాస్త్రి భారతీయ సాంస్కృతిక వైభవాన్ని పరిరక్షిస్తున్నారని, ఆయన రచనలు పలువురిని చైతన్య భరితం చేసినట్లు చెప్పారు. కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు మాట్లాడుతూ చెరువు సూర్యనారాయణ మూర్తి- సీతారావమ్మ పేరిట ఏర్పాటు చేసిన పురస్కార పూర్వ గ్రహీతలను పరిచయం చేస్తూ, సూర్యనారాయణ మూర్తి విద్యా సేవలను కొనియాడారు. హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ దీవి నరసింహ దీక్షితులు మాట్లాడుతూ చిదంబర శాస్త్రి సాహిత్య సేవలు, భారతీయ ధర్మాన్ని ప్రచారం చేస్తున్న తీరు వివరించారు. కార్యక్రమంలో చెరువు సత్య నారాయణ మూర్తి, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి , జూపూడి రంగరాజు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, బండ్లమూడి హనుమాయమ్మ కళాశాల కార్యదర్శి కర్పూరపు శాంతి భూషణ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

గుంటూరు మెడికల్: ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత స్లాబ్‌ను కొనసాగించాలని ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఏపీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం కార్యక్రమానికి గుంటూరు జిల్లాలో అన్ని తాలూకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఉద్యోగులు నిరసన కార్యక్రమానికి హాజరై కలెక్టర్ కార్యాలయము ముందు నిరసన వ్యక్తం తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ డెప్యూటీ సెక్రటరీ జనరల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆదిలక్ష్మి, బసవలింగారావు, వేలంగిని రాజు, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు కే నరసింహారెడ్డి, వెటర్నరీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాయక్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, చైర్మన్ రాధా రాణి, కన్వీనర్ లక్ష్మీరమ్య, కె.శివజ్యోతి, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. ఏపీ జేఏసీ కన్వీనర్ శెట్టిపల్లి సతీష్ కుమార్ పాల్గొన్నారు.